వైద్య రంగానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వెల్జాల్ గ్రామస్తులు

కడ్తాల్ (తలకొండపల్లి), సెప్టెంబర్ 24: ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేని కలిసి, గ్రామంలో ప్రభుత్వ దవాఖాన ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాదాపు 15 గ్రామాలకు కూడలిగా ఉన్న వెల్జాల్‌లో ప్రభుత్వ దవాఖాన లేక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేదలకు ప్రభుత్వ వైద్యం అందకపోవడంతో ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో ప్రభుత్వ దవాఖాన ఏర్పాటుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, మాజీ ఉప సర్పంచ్ ఆజీజ్, నాయకులు ఆరీఫ్, వెంకట్ రెడ్డి, అశోక్‌బాబు, కృష్ణయ్యగౌడ్, మల్లేశ్, లక్ష్మణ్, విష్ణు, బాబా పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయాంజాల్, సెప్టెంబర్ 24: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం 51వ మహజన సభను మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలోని ఓ గార్డెన్స్‌లో సంఘం చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, రైతులందరికీ రుణమాఫీ అందజేసిందని అన్నారు. రైతులకు అన్ని రకాల సేవలకు అందించడానికి సహకార సంఘాలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా మహజన సభలో రైతులు చెప్పిన సమస్యలు, వినతులను పరిగణనలోకి తీసుకొని వాటి అమలుకు తీర్మానం చేయాలని అన్నారు. అనంతరం తుర్కయాంజాల్ రైతుసేవా సహకార సంఘం చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ సహకారంతో తుర్కయాంజాల్ రైతుసేవా సహకార సంఘానికి 5 ఎకరాల భూమి ఉచితంగా కేటాయించినట్లు తెలిపారు. ఈ భూమిలో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల నిర్మాణం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రంగారెడ్డితో కలిసి రైతులకు సబ్సిడీ కింద మందు పిచికారీ యంత్రాలు, టార్పాలిన్ కవర్లను అందజేశారు. ఈ సమావేశంలో రైతుబంధు సమితి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు స్వప్న, సంజీవరెడ్డి సత్యనారాయణ, యాదగిరి, లక్ష్మమ్మ, కౌన్సిలర్ సునిల్, బ్యాంక్ సెక్రెటరీ రాందాస్, నాయకులు లక్ష్మారెడ్డి, శంకర్, రాగ్యానాయక్ పాల్గొన్నారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి

లోక్ అదాలత్‌లో 108 కేసులు పరిష్కారం

కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 24 : వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపరాదని రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని సివిల్ కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపటం చట్ట రీత్యా నేరమన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో 108 కేసులు పరిష్కరించి, రూ.2,93,500 జరిమానా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వేంకటేశ్, కోర్టు, పోలీస్ సిబ్బంది కవిత పాల్గొన్నారు.

చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దుతాం

షాద్‌నగర్‌టౌన్: పట్టణ ముఖ్యకూడలిలో విద్యార్థులు, అధికారులతో కలిసి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 24: పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దుకుందామని మున్సిపల్ కమిషనర్ వెంకన్న అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు పట్టణ ముఖ్యకూడలి వరకు విద్యార్థులతో కలిసి స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదే విధంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని, తడి చెత్తతో ఎరువు తయారు చేయడంతో పాటు పొడి చెత్తను తిరిగి ఉపయోగించే విధంగా రీసైకిలింగ్ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చదనం, శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

నందిగామ : మండల పరిధిలోని చేగూరు గ్రామంలో మంగళవారం జిమ్స్ మెడికల్ కళాశాల, జిమ్స్ హాస్పిటల్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నందిగామ తహసీల్దార్ రాజేశ్వర్ హాజరై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామస్తులతో కలిసి గ్రామంలో పచ్చదనం, శుభ్రతపై అవగాహన కల్పించి, పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారి విరాజ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వీణ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

షాబాద్, సెప్టెంబర్ 24: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని షాబాద్ ఎంపీడీవో అపర్ణ అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా షాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో పంచాయతీ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. షాబాద్ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్‌రాథోడ్,

షాబాద్ మండలం ఏట్ల ఎర్రవల్లిలో పంచాయతీ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వైద్యులు తబుసం, స్వర్ణలత, ఏపీవో వీరాసింగ్, పాఠశాల ప్రత్యేకాధికారి కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి అనిత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

కడ్తాల్ : విద్యార్థులకు చిన్నతనం నుంచే పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలని ఎన్‌హెచ్ఏఐ సీనియర్ ఇంజినీర్ సాయికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌హెచ్ఏఐ-ఆర్వీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుభ్రత-రోడ్డు భద్రత అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాల శుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. అనంతరం ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జంగయ్య, ఆర్వీ ప్రతినిధి గంగాధర్, ఎన్‌హెచ్ఏఐ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ రత్నకుమార్, గ్రేట్ ఇంజినీర్ శ్రీనివాస్, టీం లీడర్ అమ్రేశ్, ఉపాధ్యాయులు భీముడు, జనార్ధన్‌రెడ్డి, శోభారాణి, గీత, భాగ్యలక్ష్మి, భాగ్యమ్మ, ప్రవంతి, శ్వేత, గీతాబాయి పాల్గొన్నారు.

చేగూరులో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న జిమ్స్ హాస్పిటల్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

షాబాద్ ప్రభుత్వ దవాఖానలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో అపర్ణ

కడ్తాల్: విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్, సెప్టెంబర్24: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మందికి మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ గౌతంకుమార్, ఎంపీడీవో సంధ్యతో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని చెప్పారు. ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థికసాయం అందిస్తుందని అన్నారు. ప్రతి అర్హులైన పేదలకు జీరో విద్యుత్ బిల్లులు వస్తున్నాయని తెలిపారు. రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని చెప్పారు. వచ్చే నెలలో రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందని చెప్పారు. పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, టీపీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణెయ్య, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రవీణ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ యాదయ్య, నాయకులు మహేందర్‌ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, ఎం.జంగారెడ్డి, బాబు, రాజుగౌడ్, మల్లేశ్ గౌడ్, విజయరాజు, యాదగిరిచారి, రమేశ్, జంగయ్య పాల్గొన్నారు.

అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు

ప్రభుత్వ పరంగా నిర్వహించే కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సందడి చేశారు. ప్రభుత్వపథకాలను అధికారులు, ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమాలు నిర్వహించడం సంప్రదాయం. కానీ అధికారులు నిర్వహించే కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొనడం విశేషం. ప్రజల చేత ఎన్నుకోబడని నేతలు తమ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆ నేతలకు తెలిసినా ఎమ్మెల్యే వచ్చాడని నేతలు అధికారులు అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎలాంటి పదవులు లేని వారు అధికారికంగా నిర్వహించే కార్యక్రమాల్లో పార్టీ నేతలు పాల్గొనకూడదని నేరుగా చెప్పలేక ఒకరితో ఒకరు గుసగుసలాడారు.

కార్యక్రమంలో కూర్చున్న కాంగ్రెస్ నేతలు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మంచాలలో జరిగిన సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మంచాల, సెప్టెంబర్ 24: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గర్తుచేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు చేప్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకట్‌రెడ్డి, జిలమోని సత్తయ్య, అమీద్, మోహన్‌రెడ్డి, గాలయ్య పాల్గొన్నారు.

భవనం పై నుంచి పడి కార్మికుడి మృతి

కొత్తూరు, సెప్టెంబర్ 24: పై అంతస్తు నుంచి పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వలోని కేడీఎల్ కంపెనీ వద్ద జరిగింది. కొత్తూరు సీఐ నరసింహారావు వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ చెందిన అపికుల్ మియా (40) ఏడాది కాలంగా ఇన్ముల్‌నర్వలో నివసిస్తూ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇన్ముల్‌నర్వలోని కేడీఎల్ ఉన్న గోదాంలో నిర్మాణం కోసం కాంట్రాక్టర్ తల్లోజు నరసింహారావు వద్ద సోమవారం పనిచేయడానికి వెళ్లాడు. అయితే పనిచేస్తూ ప్రమాదవశాత్తు పై అంతస్తు నుంచి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో అతడిని హుటాహుటిన శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి అల్లుడు మాలక్ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. కాంట్రాక్టర్ తల్లోజు నరసింహాచారి తగిన జాగ్రత్తలు తీసుకోకుండా పనులు చేయిస్తూ అపికుల్ మియా మృతికి కారణమయ్యాడని సీఐ నరసింహారావు తెలిపారు.

భార్యను హింసించిన వ్యక్తిపై కేసు నమోదు

కొత్తూరు, సెప్టెంబర్ 24: భార్యను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్న వ్యక్తిపై కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నరసింహారావు వివరాల ప్రకారం.. కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన కోస్గి జంగయ్య అతడి భార్య అనితను సోమవారం తీవ్రంగా కొట్టాడు. దీంతో అనిత ప్రాణాపాయ స్థితిలో శంషాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నది. బాధితురాలు సోదరుడు బక్కని రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

మందులు అందజేస్తున్న నాయకులు, వైద్యులు

కడ్తాల్ (తలకొండపల్లి), సెప్టెంబర్ 24: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేశ్ అన్నారు. మంగళవారం తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, కామినేని దవాఖాన, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలంలో విషజ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 207 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యులు అఖిల్, అనిల్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, మాజీ ఎంపీటీసీ రఘునాయక్, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, పీఈటీ మల్లేశ్, నాయకులు వెంకటేశ్, గణేశ్, లింగయ్య, స్వామి గౌడ్, నర్సింహ, విజయ్, లక్ష్మయ్య, యాదయ్య, బాలకిష్టయ్య, అంజయ్య, రవి, దేవేందర్, మహేశ్, రాజు, సాయి, బుచ్చిబాబు, అశోక్, వినోద్, శ్రీశైలం, అఖిల్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గాలయ్య మృతి బాధాకరం

మంచాల, సెప్టెంబర్ 24: సీపీఎం నాయకుడు, పార్టీ గ్రామ కార్యదర్శి కంబాలపల్లి గాలయ్య మృతి బాధాకరమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె. భాస్కర్ అన్నారు. మంగళవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు గాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. సీపీఎం జిల్లా నాయకులు గాలయ్య మృత దేహానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత

ఆమనగల్లు, సెప్టెంబర్ 24: ఆమనగల్లు మున్సిపాలిటీలోని నవచైతన్యకాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రూ. 10 లక్షలు కేటాయించినట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ కో ఆర్డినేటర్ వస్పుల జంగయ్య తెలిపారు. మొదటి విడుతలో భాగంగా రూ. 5 లక్షల ప్రొసీడింగ్ కాపీని మంగళవారం నవచైతన్యకాలనీలోని మైసమ్మ దేవస్థానం వద్ద కాలనీ నాయకులను వస్పుల జంగయ్య అందజేశారు. అనంతరం వస్పుల జంగయ్య మాట్లాడుతూ మరో రూ.5 లక్షలు త్వరలోనే అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు జానయ్య, మైసయ్య, మహేశ్, బాలరాం, శంకర్, కిరణ్, బాలకృష్ణ, సురేశ్, వినయ్, శ్రీను, రాజు, శివ, సురేశ్ పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధిస్తాం

ప్రశంసా పత్రాలను అందుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబర్ 24 : రానున్న పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులందరూ కృషి చేస్తున్నట్లు ఫరూఖ్‌నగర్ మండలంలోని విళ్వల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి తెలిపారు. పాఠశాలలో 2023 పది ఫలితాల్లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులతో పాటు, ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులైన మల్లేశ్, రవి కాంత్, రవిలను ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మంగళవారం ప్రశంసాపత్రాలను అందించి, సన్మానించారు. పది జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5వేలు ప్రోత్సాహక నగదును ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లు

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో తులసి

ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీవో తులసి

ఇబ్రహీంపట్నంరూరల్, సెప్టెంబర్ 24 : గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత శాతం ఎక్కువగా ఉంటున్నందున ఐరన్, ఖనిజం కలిగిన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. పోషణ మాసంలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇబ్రహీంపట్నం పరిధిలోని చర్లపటేల్‌గూడ గ్రామంలో మంగళవారం గర్భిణులు, బాలింతలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తహీనత గర్భిణులు, బాలింతల్లో పెరిగిపోతున్నందున చిరు ధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పల్లవి, ఏఎన్ఎం ఫరీదా, ఏడబ్ల్యూటీ సంతోష, సుమిత్రా, వీబీకేలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆమనగల్లులో పోషకాహార మాసోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో శాంతిరేఖ

ఆమనగల్లులో మాసోత్సవాలు..

ఆమనగల్లు, సెప్టెంబర్ 24: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో శాంతిరేఖ అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ ఆమనగల్లు ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా సీడీపీవో శాంతిరేఖ, మెడికల్ ఆఫీసర్ మంజులాదేవి, సూపర్‌వైజర్స్ అనిత, ఉమ హాజరయ్యారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలపై బాలింతలు, గర్భిణులు, కిశోరబాలికలకు ఆమె వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు

యాచారం, సెప్టెంబర్24 : మండలంలోని మాల్, మంథన్‌గౌరెల్లి, నల్లవెల్లి, తమ్మలోనిగూడ, కేసీతండా గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో నరేందర్‌రెడ్డి సమక్షంలో మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ దవాఖాన వైద్యురాలు ప్రియాంక సిబ్బందికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ శివప్రసాద్, తహసీల్దార్ ముంతాజ్, ఎస్ఐ వరప్రసాద్, లయన్స్ క్లబ్ సభ్యులు

కడ్తాల్, సెప్టెంబర్ 24: గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని సీఐ శివ ప్రసాద్ అన్నారు. మంగళవారం లయన్స్ క్లబ్ సభ్యుడు బిచ్చానాయక్ తండ్రి సీత్యానాయక్ వర్ధంతి సందర్భంగా, మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమాన్ని తహసీల్దార్ ముంతాజ్, ఎస్ఐ వరప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, పీఆర్వో పాషా, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, భీక్యానాయక్, వేణుగోపాల్, వీరయ్య, రామచందర్, జగన్, చంద్రు, బలరాం, శంకర్ క్లబ్ సభ్యులు శ్రీను, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్, మహేశ్, రాజేందర్‌యాదవ్, నర్సింహ, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులను తొలగించాలి

పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజుకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్, నాయకులు

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 24: ఫరూఖ్‌నగర్ మండలంలోని కిషన్‌నగర్ గ్రామంలో బెల్టు షాపులను ఎత్తివేయాలంటూ మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు, గ్రామ పెద్దలు మంగళవారం పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజు, ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతి లేకుండా విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయిస్తున్నారని, దీంతో ఎంతో మంది మద్యానికి బానిసలవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా తూతూ మత్రంగా తనిఖీ చేస్తున్నారు తప్ప, శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. ఇప్పటికైనా గ్రామంలో బెల్ట్‌దుకాణాలను ఎత్తివేయకుంటే ఆందోళన చేపడుతామన్నారు. అనంతరం కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే జరిమానా విధించడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో మద్యం విక్రయించొద్దంటూ చాటింపు వేయిస్తామని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు వెంకటేశ్‌గౌడ్, శ్రీశైలం, శేఖర్ ఉన్నారు.